# శహన

ప్రకాశం బద్ధకంగా ఆవలించి చిటిక వేశాడు. అంత కన్నా బద్ధకంగా వేళ్ళు విరుచుకొన్నాడు. ఓసారి దుమ్ము రేగుతున్న రోడ్డుకేసీ, దానిపక్క నేఉన్న హోటలుకేసీ చూశాడు. చిరాగ్గా పెదాలు తడుపుకొన్నాడు.

ఇప్పటికి రెండుగంటల్నించీ, ఆ మర్రిచెట్టుక్రింద కూచున్నాడు ప్రకాశం. ప్రతి అయిదేసినిమిషాల కొకసారి, రోడ్డుమీదికొచ్చి, రోడ్డు చివరికంటా పరిశీలించి చూసేవాడు. ఎక్కడా బస్సువస్తున్న చిహ్నం కనిపించేదికాదు. ఎవరిమీదనో విసుక్కుంటూ తిరిగి తన బెడ్డింగుదగ్గరకొచ్చి కూలబడేవాడు. మళ్ళీ అయిదునిమిషాలాగి రోడ్డుమీదికి రావడం, పరకాయించి, బస్సువస్తున్నదేమో చూడటం, విసుక్కొంటూ బెడ్డింగుకు జేరబడటం — తూ.చా. తప్పకుండా రెండుగంటల్నించీ చేస్తున్నాడు.

అన్నీ సక్రమంగా జరిగినట్లయితే, తనీపాటికి అత్తవారి ఊళ్లో ఉండవలసింది. అదేం గ్రహాచారమోగానీ, ఈ రోజున అన్నీ అడ్డంకులే! ప్రతిరోజూ కరెక్టుగావచ్చే రైలు బండి, ఈరోజున 190 నిమిషాలు లేటుగావచ్చింది. అదేదో స్టేషనుదగ్గర, గూడ్సువాగన్ పట్టాలుతప్పడంతో రెండుగంటలసేపు, బండి అక్కడే ఆగిపోయింది. ఒక్క రైలుప్రయాణమే, రమారమి ఏడుగంటలుపట్టింది. బస్సులో రెండుగంటలు ప్రయాణం చెయ్యాలి. ఆపైన అయిదుమైళ్ళు కాలిబాటననడవాలి. ఈ అయిదుమైళ్ళలోనూ, నాలుగువాగులు

దాటాలి. అరణ్యాల్లాంటి తుమ్మబీళ్ళల్లోగుండా వెళ్ళాలి. పట్టపగలే పీచుపీచుమంటుండే ఆ బాటలో—రాత్రిళ్ళు తానొక్కడూ వెళ్ళగలగడం అసంభవం!

హఠాత్తుగా అతనికి భార్యమీాదా, ఆవిడ తండ్రి మీాదా కోపంవచ్చింది. అంత నీరసంలోనూ ప్రకాశం తుభుక్కున ఉమ్మివేశాడు.

అసలీగొడవంతా, తన మామగారివల్లనే వచ్చింది. పంపమన్నపుడు పంపకపోతే, మొఖం కందగడ్డలా చేసుకొంటాడు. ఈవిడా, వదనారవిందం చిటమటలాడిస్తుంది. పోనీ గదాని పంపితే, నెలలకు నెలలు గడిచినా తిరిగిరావడమంటూ ఉండదు. అప్పటికీ తను ఎన్నిఉత్తరాలు రాశాడు! ఎంతమందిచేత కబుర్లుచేశాడు. ఒక్కదానికీ సరైన సమాధానమే రాదు. చిన్నమ్మాయికి నలతగా ఉన్నదనో, పెద్దవాడికి సుస్తీఅనో, శ్రావణమాసంలో ఉత్తరందిక్కున నడవకూడదనో, పున్నమిముందు పుట్టింటికి, అమావాస్యముందు అత్తింటికి వెళ్ళకూడదనో, నక్షత్రం మంచిదికాదనో, వల్లకాదనో, పళనకాదనో, సవాలక్ష చచ్చుసమాధానాలు రాస్తారు. అన్నీ కలిసివచ్చేదాకా అమ్మాయి ఆగుతుందాని ప్రతిదానికి మీానమేషాలు లెక్కేడుతూకూచుంటే పనులు జరగొద్దూ!

అసలే తనది అంతంతమాత్రపు శరీరం! పైగా ఆఫీసులో గాడిదచాకిరీ చేయిస్తారు. రోజుకు పదేసిగంటలు వంచిన నడుం ఎత్తకుండా పనిచేసి, హోటలుతిండి తినాలంటే మాటలేనా? ఈ సంగతి ఆవిడకూ తెలుసు. తెలిసి

కూడా, ఆ మనిషి తింగురంగా అంటూ, పుట్టింట్లో నెలల కొద్దీ బిచాణా వేసిందంటే దాన్నేమనాలి? ఏంచేస్తే పాపం తీరుతుంది!

తనలా ఉత్తరం రాయంగానే, ఆవిడ వచ్చినట్లయితే, ఇప్పు డిన్ని ఇబ్బందులు పడాల్సిన అవసరమే ఉండేదికాదు. దాని తెలివితక్కువతనానికి తను అనుభవిస్తున్నాడు శిక్ష. జీతం నష్టంమీద వారంరోజులు సెలవు దొరికేటప్పటికి తాతలు దిగొచ్చారు. పైగా బోలెడంత డబ్బు ఈ రైళ్ళకూ కార్లకూ పోతాయి. వీటన్నింటినీమించి, కట్టుకుపోయినంత రిస్కొకటి. ఎందుకొచ్చిన లాయలాసా ఇదంతా ?

ఈ దిక్కుమాలిన ప్రయాణం సక్రమంగా జరుగుతుం దనుకొన్నాడు తను. అంచాతే కాసిన్ని కాఫీనీళ్ళు తాగి బయలుదేరాడు. ఇప్పుడు నాలుగ్గంటలయింది. ఇంతవరకూ బస్సురాలేదు. అదెప్పటికొస్తుందో గూడా ఎవరికీ తెలీదు. జనం చూడామా మూడుబస్సులకు సరిపడా ఉన్నారు. ఈ అతిరథులు, మహారథులుచేసే మహాసంరంభంతో తనకు సీటుదొరికి, మధ్యలో ఇదెక్కడా చెడిపోకుండా, తన్నా బ్రిడ్జిదగ్గర దింపి, ఈ బెడ్డింగు నెత్తినేసుకొని, తను అయిదు మైళ్లూ, ఆ చిట్టడివిలో ప్రయాణంచేసి, అత్తవారూరు చేరుకోవడం సాధ్యమేనా ?

ఇప్పటికే తనకు చచ్చేటంత నీరసంగాఉంది. లేస్తే కళ్ళు తిరుగుతున్నాయి. ఊరంతా తిరిగినా భోజనహోటలు లేదు. ఈ దిక్కుమాలిన బెల్లంకాఫీని తను ఎన్నిసార్లని తాగుతాడు? తాగిన పావుగంటదాకా, కడుపులో ఏదో

తినేస్తున్నట్టుగా ఉంటోంది. మధ్యలో అడ్డంపడకుండా అడుగుకు చేరుకొంటే అదే పదివేలు.

అసలీ అత్తవారూళ్ళనేవి, రోడ్డుప్రక్కనో, రైలు స్టేషనుప్రక్కనో ఉంటే బావుండును. కాననిగంతల్లో ఊళ్ళుంటాయి. సజావైన బాటకూడా ఉండదు. తనకే అధికారముంటే, అత్తవారిఊళ్ళన్నీ అటు బస్సుకో, ఇటు రైలుకో అందుబాటులోఉండేలా ఓ శాసనంచేసి పారేసును! లేకపోతే ఎవడు పడతాడయ్యా ఈ బాధలన్నీ!

ఒక్కసారి జనం గగ్గోలుగా లేచారు. అప్పటికప్పుడే కొంతమంది మూటాముల్లే, నెత్తిమీదపెట్టుకొని, ఫర్లాంగు దూరంలోఉన్న బస్సుకేసి పరుగెత్తుతున్నారు.

ప్రకాశంకూడా ఆదరాబాదరా లేచాడు. కళ్ళు తిరిగినట్లనిపించింది. ఒక్కఊపుతో బెడ్డింగును భుజంమీది కెత్తుకొన్నాడు. ఊడిపోతున్న చెప్పుల్ని చిరాగ్గా తగిలించుకొన్నాడు. అందరితోబాటు తనూ బస్సుకేసి పరుగెత్తాడు.

ఈలోగా బస్సు రానూవచ్చింది. ఆగనూ ఆగింది. బస్సులోవాళ్ళింకా దిగనేలేదు. ఎక్కేవాళ్ళు ఈగముసిరినట్టు ముసిరారు. కొంతమంది, సందుల్లోంచి పెట్టెలు, మూటలు లోపలికి తోస్తున్నారు. ఇంకొంతమంది వాటితో బాటే తామూ లోపలికి దూరుతున్నారు. తన బెడ్డింగును కూడా లోపల పడెయ్యాలని ప్రకాశం యథాశక్తి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం ఫలించలేదు.

అతనిదృష్టి ముందుసీటుమీదికి వాలింది. ఇంతమంది జనమూ ఇక్కడే తొక్కుకుంటున్నారుగానీ, ఒక్కరూ

ఫ్రంట్‌సీట్‌కేసి పోవడంలేదు. ఇదీ మంచిదేననుకొన్నాడు ప్రకాశం. బెడ్డింగును అక్కడేవదిలి, చివ్వున ఫ్రంట్‌సీట్‌లో కూచున్నాడు. రద్దీ సద్దుమణిగాక, బెడ్డింగ్ పైన వేయించుకోవచ్చనుకొన్నాడు.

పావుగంటకల్లా గోల సద్దుమణిగింది. డ్రైవరు ఆఖరి దమ్ముపీల్చి సిగరెట్ దూరంగా గిరవాటేశాడు. స్టీరింగ్ ముందు కూచుని ఓసారి హారన్ వాయించాడు. వాయిస్తూ ప్రకాశంకేసి ఎగాదిగా చూశాడు. ప్రకాశం తనను కాదన్నట్టుగా ప్రక్కకు తిరిగాడు.

ఇంకా చాలామందిజనం బస్సునుపట్టుకు వేళ్ళాడుతున్నారు. కండక్టర్ చుట్టూ మూగి తాము అర్జెంట్‌గా వెళ్ళవలసినఅవసరాన్ని అతనిముందు ఏకరువుపెడుతున్నారు. ఇంకో అరగంటలో మరోబస్సు వస్తుందనీ, దాంట్లోరమ్మనీ సర్ది చెబుతున్నాడు కండక్టర్. అది అబద్ధమనేసంగతి ప్రకాశానికి తెలుసు. ఇంకోబస్సు ఉన్నమాటైతే నిజమేగానీ, అది ప్రస్తుతం రిపేర్‌లో ఉంది.

మరో నిముషంలో బస్సు బయలుదేరుతుందనగా అనుకోనిసంఘటన జరిగింది. కండక్టర్ ప్రకాశందగ్గరకొచ్చి దిగమని మర్యాదగా చెప్పాడు. ఓనర్‌గారి బంధువులెవరో వస్తున్నారట. వారికోసం మూడుఖాళీలు కావలసివచ్చాయి. ప్రకాశం దిగనన్నాడు. తనుగూడా అర్జెంట్‌గానే వెళ్ళాలన్నాడు. అంతగా అవసరమయితే, ఆ బంధువుల్నే, మరో అరగంటలోవచ్చే బస్సులో రమ్మన్నాడు! లేదా తనకు లోపల సీటు చూపిస్తే నిక్షేపంగా దిగుతానన్నాడు. అంతే

గానీ, ఉట్టినే దిగిపొమ్మంటే మాత్రం తను దిగననీ, నువ్వు చెయ్యగలిగిందేదో చేసుకోవచ్చనీ, తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ కండక్టర్‌తో దెబ్బలాడాడు.

తను చెయ్యగలిగిందేదో అదే చేశాడు కండక్టరు. అంతమందీ చూస్తుండగా, ప్రకాశాన్ని చెయ్యిపుచ్చుకుని లాగేశాడు మంచీమర్యాదా లేకుండా. నీ దిక్కున్న చోట చెప్పుకోమన్నాడు. కోపంతో గట్టిగా ఈల వేశాడు. ఓ కుదుపు కుదిపి, దుమ్ము లేపుతూ బస్సు వెళ్ళిపోయింది.

ప్రకాశం కోపంతో కుతకుతలాడిపోయాడు. రోడ్డు మీద రేగిన దుమ్ము కేసి అసహ్యంగా చూసి, తుభుక్కున ఊశాడు. తలొంచుకొని, తన బెడ్డింగ్ దగ్గర కొచ్చాడు.

తలెత్తి చూడటానికి, అతనికి చిన్నతనంగా ఉంది. ఇంతమందిలో మర్యాదా, మన్ననా లేకుండా, ఆ కండక్టర్ తనను రెక్కబట్టుకొని బస్సు దించేశాడు. బస్సు అందలేదన్న బాధకంటే, కండక్టర్ దించేశాడన్న బాధే ప్రకాశాన్ని ఎక్కువగా వేధించింది.

సాచి రెండు చెంపలూ వాయిద్దామనుకొన్నాడు ప్రకాశం. రావడానికి అంతకోపమూ వచ్చింది. కానీ, తనకీ వూరు కొత్త. ఏదో సామెత చెబుతారే, ఒకఊరి కరణం, మరోఊరికి వెట్టివాడని! అట్లా అయింది తన పరిస్థితి.

ప్రకాశం ఓసారి చుట్టూ చూశాడు. అందరూ తనను గురించే మాట్లాడుకొంటున్నట్టూ, తననుచూసే నవ్వుతున్నట్టూ ఫీలయ్యాడు. ఈ అవమానానికి తగిన ప్రతిక్రియ చెయ్యాలనుకొన్నాడు. కానీ ఏమిటి చెయ్యడం?

ఇక ఈరోజుకు అత్తవారూరు వెళ్ళడం పడదు. మరో బస్సు రావడమనేదికల్ల, వచ్చినా తనా బస్సులో ప్రయాణం చెయ్యలేదు. ఎంతహీనంగా చూసుకొన్నా బ్రిడ్జిదగ్గర కెళ్ళడానికి దగ్గరదగ్గర రెండుగంటలు పడుతుంది. ఇప్పటికే అయిదయింది. ఏడుగంటలపుడు తను బ్రిడ్జిదగ్గరదిగి, అయిదు మైళ్ళు, ఒంటరిగా నడిచివెళ్ళడం అసంభవం. కష్టమో, సుఖమో ఈరాత్రి ఈఊళ్లో గడపవలసిందే!

హఠాత్తుగా అతనికి ప్రసాదరావు జ్ఞాపకంవచ్చాడు. ఒక్కసారి ప్రాణంలేచివచ్చినట్లయింది ప్రకాశానికి. అన్నట్టు —ప్రసాదరావుది ఈ ఊరేగదూ! నిన్నసాయంత్రమే వాడు తనకు ఆఫీసుదగ్గర కనిపించాడు. వాడితోబాటు తనోరాత్రిని ఈ ఊళ్ళో గడిపాడు. వాడితండ్రికూడా తనకు పరిచయమే! అందులోనూ అతను పోలీస్ ఇనస్పెక్టర్!

ప్రకాశానికి ఉత్సాహం రేకెత్తింది. ఈరాత్రి వారింట్లో గడపనూవచ్చు. పనిలోపనిగా ఆ కండక్టర్ మీద రిపోర్టు ఇవ్వనూవచ్చు. ఇందాక వాడు "నీ దిక్కున్నచోట చెప్పుకో"మన్నాడు తనను. తనకున్న దిక్కేమిటో ఇప్పుడు తెలిసొస్తుంది వెధవకు.

ప్రకాశం బెడ్డింగు భుజానకెత్తుకొని, స్టేషన్ వేపు ఉత్సాహంగా నడిచాడు. ఆ సంతోషంలో అతనికి బెడ్డింగ్ భారమనిపించలేదు.

వాకిట్లోనే ఇనస్పెక్టర్ ఎదురయ్యాడు. ప్రకాశాన్ని ఓక్షణం ఎగాదిగాచూసి, ఓ చిరునవ్వు నవ్వి, కళ్లెగరేశాడు

ఇనస్పెక్టర్. బెడ్డింగ్ గోడకానించి, ఒక్కసారి చేతులు విదిలించుకొన్నాడు ప్రకాశం.

ఇనస్పెక్టర్ ఎక్కడికో వెళ్ళేప్రయాణంలో హడావుడిగా ఉన్నాడు.

"మీ రిక్కడే ఉండండి సార్! ఓ గంటలో వస్తాను. రాత్రికి తీరిగ్గా మాట్లాడుకొందాం. కొంచెం అర్జెంట్పని మీద పోతున్నాను. ఇప్పుడు మీ రెక్కొచ్చిన బస్సుంది చూశారా, అది పోతూపోతూ, ఊరిముందు బోల్తాపడిందట సార్! చాలామందికి ప్రమాదంగా దెబ్బలు తగిలాయట. ఇప్పుడే వచ్చేస్తాను. మీ రిక్కడే ఉండండి" అంటూ సైకిలెక్కి తూనీగలా వెళ్ళిపోయాడు ఇనస్పెక్టర్, ప్రకాశం అత్తవారింటినించి వస్తున్నాడనుకొని.

ప్రకాశం ఒక్కసారి నిలువునా చలించిపోయాడు. గట్టిగా కళ్ళు మూసుకుని కుర్చీలో కూలబడ్డాడు.